క్లుప్తంగా

రేపు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



కరపత్రాలు విడుదల చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

కోట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కోటలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టనున్నట్టు వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. వారు సోమవారం కోటలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనేది ప్రాధాన్యత అంశమన్నారు. దీనిపై తమ వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలిసేలా కోట క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడతామని తెలిపారు. అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారంతా సంఘీభావం తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీజూరు మాధవ్, సుందరం, వసంత్, కృష్ణయ్య, హేమంత్ పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

గూడూరు రూరల్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు సోమవారం విరాళాలు సేకరించారు. గూడూరు పట్టణంలోని మాయాబజార్, వివేకానందరోడ్డు, ముత్యాలపేట, గాంధీ మున్సిపల్ బిల్డింగ్, ఎన్టీఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పూల వ్యాపారుల నుంచి రూ.8,850 సేకరించి రాష్ట్ర కమిటీకి పంపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి జోగి శివకుమార్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, బి.వి.రమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, పుట్టా శంకరయ్య, శేఖరాచారి, వినయ్, చంద్రయ్య, జానీ తదితరులు పాల్గొన్నారు.

చవితి లడ్డు రూ.76 వేలు



లడ్డూను దక్కించుకున్న వెంకటేశ్వరరాజు

చిల్లకూరు : గూడూరు మండలం పారిచెర్లరాజు పాళెంలో వినాయకుడి విగ్రహం వద్ద ఉంచిన లడ్డును సోమవారం వేలం వేయగా రూ.76 వేలు పలికింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరాజు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

'సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి'



మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్ : ముందు జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నాయుడుపేట డీఎస్పీ జి.చెంచుబాబు సూచించారు. ఆయన సోమవారం నాయుడుపేటలోని బంగారు దుకాణదారులు, షాపింగ్ మాల్స్, మార్ట్స్, దుకాణదారులతో సమావేశమయ్యారు. ఆయన మట్లాడుతూ పట్టణంలో కొంతమంది మాత్రమే దుకాణాల వద్ద సీసీ కెమెరాలు పెట్టుకున్నట్టు తెలిపారు. ఒక్క కెమెరా వంద మంది పోలీసులకంటే బాగా ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా ఇళ్లకు తాళం వేసి ఊరికి వెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ విధానాన్ని వినియోగించుకోవాలన్నారు. గతంలో పట్టణంలో ఉన్న సీసీ కెమెరాలను బాగు చేయిస్తామని చెప్పారు. అనంతరం దుకాణదారుల సమస్యలు తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న చర్యలపై సీఐని అడిగి తెలుసుకున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



గూడలి వద్ద స్వర్ణముఖి నది వద్ద గ్రామస్తులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

కోట: మండలంలోని గూడలి సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను టీడీపీ నాయకులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. వారికి అధికారులు సహకరిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం రాత్రి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అవి గూడూరుకు చెందిన వారివిగా సమాచారం. విచారణ జరిపి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కోలాహలంగా నిమజ్జనం



వాకాడు: తూపిలిపాళెం సముద్రంలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్/దొరవారిసత్రం/పెళ్లకూరు/సైదాపురం: : పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను సోమవారం సముద్రంలో నిమజ్జనం చేశారు. విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లపై పెట్టుకుని తప్పెట్లు, బాణసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ తూపిలిపాళెం బీచ్ వద్ద సముద్రంలో కలిపారు. పలుచోట్ల అన్నదానం చేశారు. నాయుడుపేటలోని బ్రాహ్మణవీధి కరాచి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని లడ్డును డాక్టర్ హరిప్రియ, సత్యనారాయణ దంపతులు రూ.57,101లకు దక్కించుకున్నారు. అదే విధంగా రాజగోపాలపురం 4వ వీధి, మహాలక్ష్మమ్మ నగర్‌లో లడ్డులకు వేలం పాట నిర్వహించారు.

■ దొరవారిసత్రం మండలంలో కొన్ని ప్రాంతాల్లో సమీపంలోని చెరువుల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, తనియాలి, పాళెంపాడు, అక్కరపాక, ఎన్ఎం అగ్రహారం, పోలిరెడ్డిపాళెం, పూలతోట, కల్లూరు, సింగనాలత్తూరు, శ్రీధనమల్లి, చందనముడి, బూదూరు తదితర గ్రామాల వారు ట్రాక్టర్లలో ఊరేగిస్తూ వాకాడు మండల తూపిలిపాళెంలో సముద్రంలో నిమజ్జనం చేశారు. ఎస్ఐ అయాజ్‌కుమార్ డ్రైవర్లు మద్యం సేవించారా లేదా అని పరిశీలించారు.

■ పెళ్లకూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోల్లో ఏర్పాటు చేసుకొనిఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం తూపిలిపాళెం వద్ద సముద్రంలో నిమజ్జనం కోసం తరలివెళ్లారు.

రెండో రోజు 514 విగ్రహాల నిమజ్జనం

- ఒకే రోజు 50 వేల మంది భక్తులు సముద్ర స్నానం
- కిటకిటలాడిన తూపిలిపాళెం సముద్ర తీరం

వాకాడు : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రెండో రోజు సోమవారం వివిధ ప్రాంతాల నుంచి 514 విగ్రహాలను తూపిలిపాళెం వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. సముద్ర తీరం భక్తులతో కిటకిటలాడింది. మునుపెన్నడూ లేని విధంగా ఒక్క రోజులోనే 50 వేల మంది భక్తులు సముద్ర స్నానం ఆచరించారు. వాయుగుండం కారణంగా అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నప్పటికీ స్థానిక మత్స్యకారులు, పోసులు అవగాహన కల్పించడంతో భక్తులు ఇబ్బందులు లేకుండా భక్తి స్నానం ఆచరించారు. గూడూరు డీఎస్పీ రమణకుమార్, వాకాడు సీఐ హుస్సేన్‌బాష, ఎస్ఐ నాగబాబు నిరంతరం పర్యవేక్షించారు.

■ సైదాపురం మండలంలోని సైదాపురం, ఊటుకూరు, గిద్దలూరు, మర్లపూడి, చాగణం, కలిచేడు, తలుపూరు, రామసాగరం తదితర గ్రామాల్లో సోమవారం వినాయకుడి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తూపలిపాళెం వద్ద ఉన్న సముద్రంతో పాటు సైదాపురం కైవల్యానదిలో నిజ్జనం చేశారు. పలుచోట్ల ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ క్రాంతికుమార్ బందోబస్తు ఏర్పాటుచేశారు.



నాయుడుపేటు టౌన్ : వేలంలో లడ్డును దక్కించుకున్న వైద్యురాలిని కారులో ఊరేగిస్తున్న యువకులు



దొరవారిసత్రం: నిమజ్జనానికి వినాయకుడిని తరలిస్తున్న ఏకొల్లు వాసులు



సైదాపురం: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడి విగ్రహాలు



నాయుడుపేటు టౌన్ : నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకు విగ్రహాల వద్ద యువత కోలహలం.



పెళ్లకూరులో నిమజ్జనం కోసం తరలిస్తున్న వినాయకుడి విగ్రహం



వాకాడు : తూపిలిపాళెం సముద్ర తీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

గూడూరు రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. ఆయన సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణ పనులు జరగడం లేదని, దీంతో పనులు లేక కార్మికులు 3 నెలల నుంచి అవస్థలు పడుతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. స్పందించిన సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. అదే విధంగా పలు మండలాల నుంచి భూసమస్యల పరిష్కారంపై పలువురు అర్జీలు అందజేశారు.



సబ్‌కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న భవన నిర్మాణ, ప్రజా సంఘాల నాయకులు

పంచాయతీల అభివృద్ధే ధ్యేయం

సైదాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కార్యదర్శులను ఆదేశించారు. ఆయన సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పీఎం విశ్వకర్మయోజన పథకానికి అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని సూచించారు. ఆధార్‌కార్డులు లేని ఎస్టీలను గుర్తించాలన్నారు. రిసోర్స్‌పర్సన్ శ్రీవిద్య పాల్గొన్నారు.

నిమజ్జనానికి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలి

నాయుడుపేట టౌన్ : వినాయకుని నిమజ్జనానికి వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని నాయుడుపేట డీఎస్పీ జి.చెంచుబాబు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనానికి వెళ్లిన నాయుడుపేటకు చెందిన ఇద్దరు యువకుల్లో ఒకరు మృతి చెందగా, మరొక యువకుడు గల్లంతవడం బాధాకరమన్నారు. విగ్రహాలను తరలించే వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. కమిటీ సభ్యులపైనా చర్యలు ఉంటాయన్నారు. భారీ విగ్రహాల తరలించే సమయంలో చిన్నపిల్లలను విగ్రహాల పక్కన కూర్చోబెట్టరాదని తెలిపారు. నాయుడుపేట అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి

దొరవారిసత్రం : మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని దొరవారిసత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య కోరారు. పూలతోట గ్రామంలో సోమవారం స్విమ్స్, బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యులు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. మహిళలు, పురుషుల్లో నోటి క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి, నాయకులు శ్రీనివాసులునాయుడు, డాక్టర్ పద్మావతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు 11న తనియాలి 13న ఉచ్చూరు, 18న నెలబల్లి, 20న కొత్తపల్లి, 23న పోలిరెడ్డిపాళెం, 25న ఏకొల్లు, 27న వేణుంబాకం గ్రామాల్లో జరుగుతాయని, సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి చైతన్య తెలిపారు.

నాయుడుపేటలో విషాదం

- వినాయకుని నిమజ్జనంలో ఒకరి మృతి
- మరొక యువకుడి గల్లంతు
- ఇద్దరూ ప్రాణ స్నేహితులు
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు

నాయుడుపేట టౌన్ : వినాయకుడి నిమజ్జనం కోసం తూపిలిపాళెం సముద్రం వద్దకు వెళ్లిన నాయుడుపేటకు చెందిన ఒక యువకుడు మృతి చెందాడు. మరొక యువకుడు గల్లంతయ్యాడు. దీంతో కుటుంబాల్లో విషాదం అలుముకుంది. నాయుడుపేట పట్టణంలోని కామమ్మ, మారయ్య ఆలయ సమీపంలో యువకులు వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అన్నదానం చేసి వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనం చేయాలని భావించారు. విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి తూపిలిపాళెం సముద్రం వద్దకు వెళ్లారు. గరిడి వీధిలో ఉంటున్న షేక్ ఫయాజ్(22) బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతని ప్రాణ స్నేహితుడు మారకపాక మునిరాజ(22) మేనకూరులోని ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ సోమవారం వినాయకుని నిమజ్జనానికి వెళ్లారు. వారితోపాటు శ్రీనివాసులు అనే యువకుడు కూడా సముద్రంలో అలల తాకిడికి కొట్టుకుపోయారు. వెంటనే గమనించిన పోలీసులు అక్కడికి చేరుకుని శ్రీనివాసులు, ఫయాజ్‌ను కాపాడారు. ఫయాజ్‌ను వాకాడు వైద్యశాలకు తరలించారు. అక్కడ అతను మృతి చెందాడు. గల్లంతైన మునిరాజ కోసం స్థానిక యువకులతో పాటు అక్కడి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



మునిరాజ ఇంటి వద్ద విషన్న వదనాలతో బంధువులు

మిన్నంటిన రోదనలు

ఫయాజ్ మృతి, మునిరాజ గల్లంతు విషయాలను తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున రోదించారు. ఫయాజ్ బీటెక్ వరకు చదువుకుంటూ ఒక దుకాణంలో పనిచేస్తూ తల్లి షాంషద్‌తో పాటు అన్నకు అండగా ఉంటున్నాడు. మునిరాజ తండ్రి మునిరత్నం చనిపోవడంతో తల్లి అంకమ్మ ముగ్గురు పిల్లలను ఎంతో కష్టపడి చదివించింది. రెండో కుమారుడైన మునిరాజ డిగ్రీ వరకు చదువుకుని మేనకూరులో ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తు కుటుంబానికి ఆధారంగా ఉన్నాడు. మునిరాజ సముద్రంలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వేనాడు గంధోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

తడ: ఈ నెల 10వ తేదీన వేనాడులో జరిగే షేక్ దావూద్ షావలీ అల్లాహ్ 29వ గంధోత్సవానికి నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. అల్లా దర్గాతోపాటు ఆయన చెల్లెలిగా భావించే షేక్ వహీదాబీ దర్గాను కూడా ముస్తాబు చేస్తున్నారు. రంగు రంగుల విద్యుత్ దీపాలు, భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.



దర్గా వద్ద ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు

బాధితులను ఆదుకోవడంలో

చంద్రబాబు విఫలం

- అధికారులను వెంట తిప్పకుంటూ షో చేస్తున్నారు
- బాధితులకు ఆహారం అందడం లేదు
- మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



కిలివేటి సంజీవయ్య మాజీ ఎమ్మెల్యే

సూళ్లూరుపేట : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విఫలమయ్యారని, జనానికి తానేదే చేసేస్తున్నానని నమ్మకం కలిగించేలా షో చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారులను వెంటబెట్టుకుని పడవల్లో వెళుతున్నట్టు ప్రచార ఆర్భాటం చేస్తున్నారని, బాధితుల ఆకలికేకలను పట్టించుకోవడం లేదన్నారు. విజయవాడకు ఇంత పెద్ద ఎత్తున వరదలు రావడానికి చంద్రబాబే కారణమని దుయ్యబట్టారు. కరకట్ట లోతట్టు ప్రాంతంలో ఉన్న తన ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా ఉండేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడకు మీదకు వదిలేసింది నిజం కాదా అని నిలదీశారు. అందువల్లే ఇంతటి ఘోర విపత్తు ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ఇది మ్యాన్ మేడ్ ఫ్లడ్ అంటున్నారని పేర్కొన్నారు. వరదలు ముంచెత్తిన తర్వాత ప్రజలు తమకు తాముగా సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారని, వారికి కనీసం గుక్కెడు మంచినీరు కూడా ఇవ్వలేకపోయారని వాపోయారు. ఎనిమిది రోజులు పాటు లక్షలాది మంది ప్రజలు అన్నం, నీరు లేక అలమటిస్తున్నారని తెలిపారు. ఈ వరదల్లో సుమారు 50 మంది దాకా ప్రాణాలు కోల్పోయారని, వారిని గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. రోజుకు రెండు మూడు సార్లు ప్రెస్‌మీట్లు పెట్టి అందరినీ తానే రక్షించేశానని భ్రమలు కల్పించడంలో చంద్రబాబు సిద్ధ హస్తుడన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ, నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తుగా ప్రభుత్వాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసి వరదలు వస్తాయని తెలిసినా ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేకపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు నిర్లక్ష్య వైఖరితో పాటు తన ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణ పవర్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి విజయవాడను ముంచేసి 50 మంది చావుకు కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములకు హద్దులు

చిల్లకూరు : మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల ఓజిలి, చిల్లకూరు మండలాల్లోని సరిహద్దుల్లో ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేసిన కొంతమంది ఆక్రమించుకుని హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒక వ్యక్తి చుట్టుగుంటకు వెళ్లే రహదారి పక్కనే సర్వే నెంబరు 958లో సుమారు 5 ఎకరాలను ఆక్రమించుకుని హద్దు రాళ్లు ఏర్పాటుచేశారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు ఆ భూమిని పరిశీలించి పెన్సింగ్ తొలగించారు. హద్దు రాళ్లు అలాగే ఉన్నాయి. వాటిపైనా ఫిర్యాదు వెళ్లడంతో సోమవారం హద్దు రాళ్లను కూడా తొలగించారు. భూమికి హద్దులు వేసిన వ్యక్తి వివరణ ఇస్తూ గతంలో ఈ భూమి మిలటరీ కోటా కింద కొంత మందికి ప్రభుత్వం పట్టా ఇచ్చిందని, వారి నుంచి తాను కొనుగోలు చేసినట్టు పేర్కొన్నాడు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళతానని వెల్లడించాడు.



ప్రభుత్వ భూమి చుట్టూ ఏర్పాటుచేసిన హద్దు రాళ్లు

ఘనంగా తంబిరెడ్డి జన్మదిన వేడుకలు

నాయుడుపేట టౌన్ : ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి పలు సేంక్షేమ కర్యాక్రమాలు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్నారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని జనార్ధన్ రెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. టీఎంఆర్ గ్రూప్ సంస్థల డైరెక్టర్లు తంబిరెడ్డి సురేష్‌రెడ్డి, తంబిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ముత్యాల్ రెడ్డి, పోట్లాపూడి రాజేష్, మొలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కరింబాయి. చెంచయ్య, నిడిగింటి చిట్టిబాబు, ఈదా రత్నశ్రీ, ఆర్కాట్ శాంత, షేక్ రహమతుల్లా, షేక్ షబ్బీర్, తన్నమాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ మాజీ చైర్మన్ జనార్ధన్ రెడ్డిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

పౌష్టికాహారంతో రక్త హీనతకు చెక్

చిల్లకూరు/గూడూరు రూరల్ : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే రక్త హీనతను అధిగమించవచ్చని గూడూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా తెలిపారు. జన విజ్ఞాన వేదిక నాయకులు సోమవారం వీఎస్ఆర్ పాఠశాల అధినేత నంది మండలం బాలక్రిష్ణంరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భంతో ఉన్నప్పుడు ఆహారాన్ని ఇష్టంగా తీసుకోవాలన్నారు. అలా కాకుండా తింటే వాంతులు అవుతాయని తినకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పెట్టే ఆహారంతోపాటు వైద్య సిబ్బంది ఇచ్చే మాత్రలను తప్పక తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, మునిగిరీష్, చెంచునారాయణ, రామ్మోహన్, అశోక్, ఆనంద్, ప్రభాకర్, సాయి, సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న జేవీవీ సభ్యులు, వైద్యులు

గురుకుల నరకం

గూడూరు పరిధిలోని గురుకులాలు విద్యార్థులకు నరకప్రాయంగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. సౌకర్యాల లేమితో చదువులపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రుచీపచీ లేని ఆహారం, శిథిలావస్థలో ఉన్న భవనాలు తదితర సమస్యలు వెంటాడుతుండడంతో గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు.

– చిల్లకూరు/కోట/వాకాడు

- గూడూరు నియోజకవర్గంలో మూడు బాలుర గురుకులాలు
- కనిపించని వసతులు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు



కోట : అపరిశుభ్రంగా ఉన్న వంట గది

గూడూరు నియోజకవర్గంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలు మూడు ఉన్నాయి. ఎన్నో ఏళ్లగా ఇక్కడ ఉన్న పాఠశాల భవనాలకు మరమ్మతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో చిల్లకూరు, కోట గురుకుల పాఠశాలల్లో కోట్ల నిదులు వెచ్చించి భవనాలను పూర్తి చేయించారు. దీంతో విద్యార్థులకు కొంత ఇబ్బందులు తప్పాయి. ప్రస్తుత ప్రభుత్వం గురుకుల పాఠశాలలపై శీతకన్ను వేయడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో బాలుర గురుకుల పాఠశాలలను సాక్షి సందర్శించింది. విద్యార్థులకు ఆకుకూర పప్పు, దోసకాయ పచ్చడి వడ్డించారు. ఇవి రెండు కూడా చారులాగా రుచీపచీ లేకుండా ఉన్నాయి. పెట్టింది తినాలనే ఆలోచనతో విద్యార్థులు మిన్నకుండిపోతున్నారు. గురుకుల అధ్యాపకుల వేతనాలతో పాటు విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు కూడా ప్రభుత్వం నుంచి మూడు నెలలుగా నిధులు మంజూరు కాలేదు.

- చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో 580 మంది, కోటలోని బాలుర గురుకుల పాఠశాలలో 700 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వాకాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు తగిన వసతులు లేవు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. గురుకులంలో 571 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నారు. గత ఏడాదికాలంగా పాఠశాల మెయింటెనెన్స్‌కు సంబంధించి నెలనెలా వచ్చే రూ.10 వేలు నిధులు నిలిచిపోవడంతో వసతులు కరువయ్యాయి. అందులో ప్రధానంగా మరుగుదొడ్లకు తలుపులు లేక అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులు రాత్రిళ్లు సైతం ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. విద్యార్థులు స్నానాలు చేయడానికి తగిన వసతి లేకపోవడం గమనార్హం. అలాగే పాఠశాలలో ఆర్ఓ వాటర్ ప్లాంటు నిర్వహణకు నిధులు పూర్తిస్థాయిలో లేవు. దీంతో తాగునీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. మూడు నెలలుగా ఉపాధ్యాయులకు సైతం ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదు.



వాకాడు: అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



వాకాడు: వసతులు లేని బాత్రూమ్‌ల వద్ద స్నానాలు